ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

గురువారం 24 అక్టోబరు 2024







సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్.. హాజరైన ప్రజాప్రతినిధులు.. అజెండాపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రైతాంగాన్ని ఆదుకుంటాం

అనావృష్టి, అతివృష్టి వర్షాలతో పంటలు దెబ్బతిని ఇబ్బంది పడుతున్న జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లా నుంచి తరలిపోయిన మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ పార్కు(ఎంఎస్‌ఎంఈ)ను తిరిగి జిల్లాకు రప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

- ఎంఎస్‌ఎంఈని జిల్లాకు రప్పిస్తాం
- కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీని సహించం
- అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు
- మేనిఫెస్టోపై టీడీపీ, వైసీపీ చిటపటలు
- అన్నమయ్య ప్రాజెక్టును పునర్‌నిర్మించాలి
- కరువు మండలాలను ప్రకటించాలి
- సమస్యలపై వాడీవేడీ చర్చ



కడప రూరల్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన బుధవారం జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ పార్కు(ఎంఎస్‌ఎంఈ), అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, డీఎస్సీ ఉచిత గ్యాస్ పంపిణీ తదితర వాటి విషయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు టీడీపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చేసిన ప్రయత్నాలను టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తిప్పికొట్టారు. కూటమి పాలనలో ప్రజాప్రభుత్వం విజయవంతంగా నడుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. అధికారులు ఇందుకు తగ్గట్టుగా బాధ్యతగా పనిచేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి ఎంఎస్‌ఎంఈను తిరిగి జిల్లాకు రప్పించేలా కృషిచేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడిని మొదటి ఏడాదిలో ఇవ్వలేదని గుర్తు చేశారు. తమ టీడీపీ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద 5 సంవత్సరాలపాటు ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలు అందించే కార్యక్ర మం రూపుదాల్చుతోందన్నారు. గత వైసీ పీ ప్రభుత్వం ఇదిగో డీఎస్సీ అదిగో డీఎ స్సీ అంటూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై చంద్రబాబు సీఎంగా మొదటి సంతకం చేసి 15,600 ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారన్నారు. దీపావళి నుంచి అర్హులైన వారందరికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీని చేపడుతున్నామన్నామని వేసీపీ నేతల దాడిని తిప్పికొట్టారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల శ్రమదోపిడీ అధికమైందని టీడీపీ పాలనలో అలా కొనసాగడానికి వీలులేదన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల విషయంలో కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో దోపిడీ చేస్తున్నారన్నారు. రూ.14వేల వరకు ప్రభుత్వం జీతం ఇస్తుంటే ఇందులో రూ.4వేలను కాంట్రాకర్లు కమీషన్‌గా తీసుకుని కేవలం రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇదిచాలా అన్యాయమన్నారు. ఈ విషయంలో జిల్లాలోని ఆయా కాంట్రాక్టు ఏజెన్సీలతో జిల్లా అధికారులు సమావేశమై కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయంచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

గత వైసీపీ పాలనలో కొంతమంది స్వార్థపరులు అధికారులతో నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో అలాంటిది ఉండదన్నారు. రౌడీయిజం చెల్లదని దానిని పక్కనపెట్టాలన్నారు. ఎవరైనా ఎంతటివారైనా ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాల్సిందే అన్నారు. వీఎన్‌పల్లె మండలంలో పనిచేయడానికి వీఆర్‌వోలు ఎవరూ ఇష్టపడడంలేదని ఎంపీపీ రఘునాథరెడ్డి అన్న మాటలపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ బెదిరింపు చర్యలు ఉన్నాయేమోనని అన్నారు. ప్రజాప్రతినిధులలో కూడా మార్పు రావాలన్నారు. ఫిర్యాదులను స్వయానా జేసీ స్థాయిలో విచారించాలని తప్పుడు ఫిర్యాదులైతే అధికారులను ఇబ్బందిపెట్టరాదన్నారు. ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామంలో ఒక్క చేనేత కార్మికుడు లేకపోయినా 50 మందికి పైగా చేనేత పింఛన్లను అందుకుంటున్నారని దీనిపై విచారణ జరిపించాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వీఎన్‌పల్లె మండలం గడ్డంవారిపల్లె రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రార్థనామందిరాన్ని నిర్మిస్తున్నారని అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

మేనిఫెస్టోపై టీడీపీ, వైసీపీ చిటపటలు

టీడీపీ, వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు చిటపటలాడారు. టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు తల్లికి వందనం కింద విద్యార్థులకు ఇస్తామన్న డబ్బులు ఎప్పుడిస్తారని, అలాగే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, డీఎస్సీ భర్తీని ఎప్పుడు చేపడతారని..

తరువాయి 6లో..



బాధితురాలి కుటుంబానికి రూ.10లక్షల చెక్కును అందజేసి పరామర్శిస్తున్న బద్వేలు టీడీపీ సమన్వయకర్త రితేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, రితేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి

బద్వేలుటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది చేతిలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక హత్యకు గురికావడం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం బాధిత కుటుంబాన్ని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలసి పరామర్శించి ప్రభుత్వం తరుపున రూ.10లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితునికి కఠినంగా శిక్ష అమలు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీచేశారన్నారు. నేరుగా ముఖ్యమంత్రి బాధిత కుటుంబంతో ఫోన్‌లో మాట్లాడి, వారిని ఓదార్చారన్నారు. ఆ కుటుంబంలో బాధితురాలి తమ్ముడికి రెసిడెన్షియల్ స్కూల్లో ఉచిత విద్యాబోధనకు సీటు ఏర్పాటు చేయాలని, ఆ కుటుంబంలో విద్యార్హతను బట్టి తల్లికికానీ, తండ్రికి కానీ ఉద్యోగం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో గంజాయిని పెంచి పోషించడంతో మహిళలపై అనేక దాడులు చోటుచేసుకున్నాయని అన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపిందన్నారు. కార్యక్రమంలో బొజ్జ రోశన్న, వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, జహంగీర్‌బాషా, మస్తాన్‌బాబు, నరసింహనాయుడు, శివయ్యస్వామి, చెరకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

నేనున్నానంటూ.. రితేశ్ భరోసా..

అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తమబిడ్డను కోల్పోయిన బాధిత కుటుంబానికి నేనున్నానంటూ టీడీపీ యువనేత రితేశ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రేమోన్మాది ఘాతుకానికి బలైన బాధిత కుటుంబానికి ఆయన అండగా నిలిచారు. మొట్టమొదటగా స్పందించి లక్షరూపాయల ఆర్థికసాయాన్ని రెండురోజుల క్రితం అందించారు. ముఖ్యమంత్రిని కలసి బాధితురాలి కుటుంబ పరిస్థితులను వివరించి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించడంలో కీలకపాత్ర పోషించారు. నియోజకజవర్గంలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కుటుంబసభ్యుల్లో ఒకరిగా కష్టసుఖాలను పంచుకుంటున్నారు.

జగన్ మాటలు అన్యాయం : ఎమ్మెల్సీ



కడప రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో బాలిక హత్యకు గురైందని వారి బంధువులను పరామర్శించి రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు, ప్రజలకు రక్షణ లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడడం అన్యాయమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జడ్పీ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాలిక మరణానికి కారకుడైన గణేశ్‌ను సంఘటన జరిగిన కొన్ని గంటలలోనే పోలీసులు పట్టుకున్నారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్వయానా సీఎం చంద్రబాబునాయుడే చెప్పారన్నారు. రూ.10 లక్షలు ఆర్థిక సహాయం కూడా చేశామన్నారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయన సొంత నియోజకవర్గం లింగాల మండలం పెద్దకూడాల గ్రామంలో దళిత మహిళను అత్యాచారం చేసి హత్యచేస్తే కేసు లేకుండా బాధితులకు అన్యాయం చేశారన్నారు. ప్రొద్దుటూరులో బీసీ నేత నందం సుబ్బయ్యను దారుణంగా చంపింది జగన్ పాలనలో కాదా అన్నారు. రాచమల్లు బావమరిదిపై ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకోలేదన్నారు. జగన్ ఇంటికి కూతవేటు దూరంలోనే గంజాయి తాగిన సంఘ విద్రోహశక్తులు ఒక మహిళపై అత్యాచారం చేసి హత్యచేస్తే నిందితులను పట్టుకోలేని దారుణమైన స్థితిలో గత ప్రభుత్వం ఉండేదన్నారు. జగన్ చిన్నాయన వివేకా హత్యపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రాన్ని పరిపాలించడం దురదృష్టకరమని ప్రజలు భావించి ప్రతిపక్ష హోదాకూడా లేకుండా 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ప్రజల రక్షణకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి తెచ్చుకొని మసలుకోవాలన్నారు.

రియల్ ఎస్టేట్ గొడవలతోనే దాడి

- టీడీపీ నగర అధ్యక్షుడిపై దాడి కేసులో ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ తేజమూర్తి

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్‌లో వచ్చిన మనస్పర్థల కారణంగానే టీడీపీ నగర అధ్యక్షుడిపై కర్రలతో దాడి చేశారని, ఈ మేరకు ఐదుగురిని అరెస్టు చేశామని చిన్నచౌకు సీఐ తేజమూర్తి తెలిపారు. ఆయన బుధవారం చిన్నచౌకు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. టీడీపీకి చెందిన బాలిశెట్టి రవితేజ, సానపురెడ్డి శివకొండారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం రవితేజకు శివకొండారెడ్డి ఫోను చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారిని బెదిరించి 30 లక్షలు తీసుకున్నావా అని అడిగారు. దీంతో రవితేజ మనస్తాపానికి గురై ఈ విషయాన్ని స్నేహితుడైన రౌడీషీటర్ దీపక్‌కు చెప్పాడు. వీరిద్దరూ మరో ముగ్గురితో కలిసి శివకొండారెడ్డిని కొట్టేందుకు రెక్కీ నిర్వహించారు. ఈ నెల 9న ఉదయం అప్సర సర్కిల్ నుంచి శివకొండారెడ్డి ఇంటికి వెళుతుండగా మానస కళ్యాణమండపం సమీపంలో స్కూటరుకు అడ్డుపెట్టి కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేశారు. కడప టౌన్‌కు చెందిన బాలిశెట్టి రవితేజ, బొమ్మిశెట్టి దీపక్, షేక్ మహ్మద్ ఇంతియాజ్, షేక్ సమీర్, ఓ బాలుడు అరెస్టయ్యారు. ఈ మేరకు నిందితులను రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ తేజమూర్తి

మత్తు కోసం..

7

- యువత మాత్రలు, సొల్యూషన్‌ల వినియోగం
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువు



యురేనియం వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్

యురేనియం వ్యర్థాలతో.. భయం భయం

యూసీఐఎల్ నిర్లక్ష్యానికి మారుపేరులా మారుతోంది. యురేనియం వ్యర్థాల తరలింపు, నిల్వపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. కానీ వాటి నిర్వహణ గాలికి వదిలేసింది అనే విమర్శలు ఉన్నాయి. వ్యర్థాలు తరలించే పైప్‌లైన్లు లీకవడం, పొలాల్లోకి ప్రవహించడం సర్వసాధారణంగా మారింది. యురేనియం వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్ నిర్వహణ పటిష్టంగా లేకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతుల నుంచి, పరిసర గ్రామాల నుంచి ఆందోళన వ్యక్తమైనపుడు మాత్రం కంటితుడుపు చర్యలు తప్ప యురేనియం వ్యర్థాల సమస్యను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ఇక్కడి జనం భయం భయంగా గడుపుతున్నారు.

- టెయిలింగ్ పాండ్ నిర్వహణ అస్తవ్యస్తం
- తరచూ యురేనియం వ్యర్థాల పైప్‌లైన్లు లీకేజీ
- పొలాల్లోకి ప్రవహిస్తున్న యురేనియం వ్యర్థాలు
- చోద్యం చూస్తున్న యూసీఐఎల్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



పులివెందుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేముల మండలం ఎం.తుమ్మలపల్లె వద్ద భూగర్భంలోని ముడి యురేనియాన్ని వెలికితీసి శుద్ధిచేసే ప్లాంట్‌ను యూసీఐఎల్ ఏర్పాటు చేసింది. యురేనియం వెలికితీయడం, శుద్ధి చేయ డం ఒక ఎత్తు అయితే.. శుద్ధిచేసినపుడు వచ్చే వ్య ర్థాలు నిల్వచేయడం మరో ఎత్తు. ఈ వ్యర్థాలు చాలా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు అంటున్నారు. యురేనియం వ్యర్థాలను టెయిలింగ్‌పాండ్‌లో నిల్వ చేయాల్సి ఉంది. దీనికోసం ప్రత్యేక పద్ధతుల్లో టెయి లింగ్ పాండ్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో నిల్వ చేసే వ్యర్థాలు భూమిలోకి ఇంకడం గా ని, బయటకు ప్రవహించడం గాని జరగకుండా తగిన భద్రతతో ఏర్పాటుచేయాలి.

శుద్ధికర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలను దాదాపు ఏడెమినిది కిలోమీటర్ల దూరం పైప్ లైన్ల ద్వారా తరలించి టెయిలింగ్ పాండ్‌లో నిల్వ చేస్తున్నారు. టెయిలింగ్‌పాండ్ నిర్వహణ ఎంత పటిష్టంగా ఉండాలో, వ్యర్థా లు తరలించే పైపులు కూడా అంతే పటిష్టం గా ఉంచి అనుక్షణం పర్యవేక్షణ చేయాలి. కానీ యూసీఐఎల్ దీని పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేసిందని చుట్టుపక్కల గ్రామాల ప్ర జలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. వ్యర్థాలను తరలించే పైప్‌లైన్లు తరచూ పాడవడం, అందులో ప్రవహించే వ్యర్థాలు లీకేజీ కావడంతో వాగుల్లోకి, వంకల్లోకి, పొలాల్లోకి చేరుతున్నాయి. ఈ వ్యర్థాలు చేరిన ప్రాంతంలో చిన్నచిన్న చెట్లు ఎండి పోతాయి. ఈ పైప లైన్లు లీకై వ్యర్థాలు కుంటల్లో కలిస్తే.. ఆ కుంటల్లోకి పశువులు గాని, మనుషులు గాని పొరపాటున దిగితే ఆ నీరు తాకినంత వరకు చర్మం ఊడిపోతుంది. ఇంతటి ప్రమాదకరమైన వ్య ర్థాలు అయినా.. యూసీఐఎల్ జాగ్రత్త తీసుకోవడంలో సరైన చర్యలు లేవని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రైతుల ఆందోళన..

పదిహేను రోజుల క్రితం యూసీఐఎల్ నుంచి వచ్చే వ్యర్థాల పైప్‌లైన్లు లీకవడంతో ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అయినా యూసీఐఎల్ అధికారుల్లో స్పందన లేదు. ఆందోళన ఉధృతం కావడంతో యూసీఐఎల్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కంటితుడుపు చర్యలు చేశారు. ఒక ఎక్సకవేటర్ సాయంతో వ్యర్థాలు ప్రవహించిన ప్రాంతాన్ని చదునుచేశారు. తరచూ పైప్‌లైన్లు లీకు అవుతున్నాయని, దీని వల్ల పంట పొలాలు నాశనం అవుతున్నాయని ఇలా అయితే తామెలా జీవనం సాగించాలని రైతులు యూసీఐఎల్ అధికారులను నిలదీశారు. పైప్‌లైన్‌కు చుట్టుపక్కల ఉన్న పొలాలన్నీ యూసీఐఎల్ తీసుకొని నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనపై స్పందించిన యూసీఐఎల్ అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటూ కంటితుడుపు మాటలతో సరిపెట్టారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గతంలో అనేకమార్లు పైప్‌లైన్లు లీకవడం, రైతుల నుంచి నిరసనలు వ్యక్తం కావడం జరిగాయి. ముడి యురేనియం నుంచి యురేనియాన్ని వేరుచేసేందుకు ప్రమాదకరమైన రసాయనాలు వాడుతారు. వాటి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు పొలాల్లో పంటలు పండటం లేదని అనేకమార్లు రైతులు ఆందోళన చేపట్టారు. అయినా యూసీఐఎల్‌కు చీమకుట్టినట్లు కూడా లేదని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్కసారి యూసీఐఎల్ ఎక్కడైనా అడుగుపెడితే ఇక ఎన్ని నిరసనలు వ్యక్తమయినా పట్టించుకోదని ఆ సంస్థలో పనిచేసే అధికారులే అనడం కొసమెరుపు. ఏదిఏమైనా టెయిలింగ్‌పాండ్ వల్ల వచ్చే సమస్యలకు యూసీఐఎల్ శాశ్వత పరిష్కారం చూపాలని ఇక్కడి రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అదుపు తప్పి.. లోయలో పడ్డ ఆర్టీసీ బస్సు

- విద్యార్థులకు, వృద్ధులకు గాయాలు



పులివెందుల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల డిపో బస్సు అదుపు తప్పి లోయలో పడ్డంతో 20 మంది గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. పులివెందుల డిపో నుంచి పల్లెవెలుగు (హైర్) బస్సు బుధవారం కదిరికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో పులివెందుల సమీపంలోని డంపింగ్ యార్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న 30 అడుగుల లోయలో పడింది. కండక్టరుతో సహా విద్యార్థులు, వృద్ధులకు దాదాపు 20 మందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను పులివెందులలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని మెరుగైన చికిత్సకోసం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా.. బస్సు డ్రైవరు అతి వేగం కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. డీఎస్పీ మురళీనాయక్, అర్బన్ సీఐ జీవన్ గంగానాధర్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి సంఘటన స్థలానికి పరిశీలించి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. పులివెందుల ఆర్డీవో అన్నపూర్ణ ప్రత్యూషబాను, తహశీల్దారు నజీర్‌అహ్మద్, ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి డిపో మేనేజరు ప్రవీణ్, పలువురు టీడీపీ, వైసీపీ నేతలు బాధితులను పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

టీడీపీ శాశ్వత సభ్యత్వం కోసం..

కడప, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష డీడీని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధనరెడ్డి అందజేశారు. శాశ్వత సభ్యత్వం కోసం లక్ష రూపాయలు చెల్లించిన మొదటి వ్యక్తి వీరే. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి డీడీ అందించారు. దీంతో గోవర్ధనరెడ్డిని సీఎం అభినందించారు. మొదటి సభ్యత్వం తన చేతుల మీదుగా అందిస్తానని సీఎం హామీ ఇచ్చారు. జిల్లా రాజకీయాల గురించి గోవర్ధనరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని సీఎంను కోరారు.



రూ.లక్ష డీడీని సీఎం చంద్రబాబుకు అందిస్తున్న సింగారెడ్డి గోవర్ధనరెడ్డి

ఆనందంగా దీపావళి చేసుకోవాలి

7

పీబీఆర్‌లోకి.. ఒక టీఎంసీ వరదనీరు




భవానీనగర్‌లోని మద్యం దుకాణం ఎదుట గ్రామస్థుల ధర్నా

నివాసాల మధ్య దుకాణం వద్దే.. వద్దు...

● మద్యం దుకాణం ఎదుట ప్రజల ధర్నా

మదనపల్లె టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ భవానీనగర్ వద్ద ఏర్పాటు చేసిన దాము వైన్స్ ఎదురుగా ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవానీనగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, ఇక్కడ మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోనే మద్యం తాగి ఆ మత్తులో గొడవలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబు పేషీకి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదులు పంపామన్నారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరొక చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం కృష్ణ, గౌస్‌మోదీన్, రషీదా, అయాజ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దని ప్రజలు బుధవారం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం ఎదుట జనసేన, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జనసేన నాయకులు ముత్యాల కిషోర్, నాగోలు అమర్‌నాథ్ మాట్లాడుతూ రాంనగర్, ఒంటెలనగర్ మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి వేరే చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణానికి సమీపంలో ప్రభుత్వ మెయిన్ పాఠశాలతో పాటు కళాశాల కూడా ఉందన్నారు. మద్యం దుకాణాన్ని ఆనుకుని కళాశాల, స్కూలుకు విద్యార్థులు వెళ్లవలసి ఉందన్నారు. మహిళలు తిరుగుతుంటారని తెలిపారు. మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ సీఐ తులసికి వినతిపత్రం సమర్పించారు. మద్యం దుకాణాన్ని పరిశీలిస్తామని సీఐ తెలిపారు.


ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

సమాజ సేవకులు...

● నిరుపేదలకు ఆసరా..సహారా.. ● మానవత్వం చాటుతున్న యువత

ఆదర్శం

వాల్మీకిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సొంత ఊరికి ఏదో చేయాలన్న తపన.. తమకు ఉన్నంతలో తోటివారికి సాయం చేయాలన్న సేవా గుణం..నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పం..సేవే మార్గం సేవే లక్ష్యంగా..మానవత్వం చాటుతున్న ఆ యువకులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన యువత సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు ఆసరాగా ఉంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మరికొందరు ప్రభుత్వ కొలువులు, ఇంకొందరు చిరు వ్యాపారులు.. ఇలా పట్టణానికి చెందిన సాదిక్‌అహ్మద్, జమీల్, ఇక్బాల్, షాహిద్, రహంతుల్లా, అయ్యప్ప, బావాజాన్, నిరంజన్, కలందర్, ఖదీర్, సయ్యద్‌బాషా, అష్రఫ్, ఆషర్, ఇర్ఫాన్, నవాజ్, ఇమ్రాన్, జహీర్, మహ్మద్, సుల్తాన్, ప్రసాద్, ఈషాన్ తదితర 15 మందికి పైగా స్నేహితులు వివిధ రంగాలలో రాణిస్తున్నారు. ఈ మిత్ర బృందం అంతా కలిసి సేవాగుణంతో జట్టుగా ముందుకొచ్చారు. 2011వ సంవత్సరం జూలై 2న సహారా ఛారిటబుల్ ట్రస్టును నెలకొల్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలతో పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా సుమారు 270కి పైగా నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ట్రస్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ మిత్ర బృందం సుమారు రూ.60 లక్షలకు పైగా నిధులు పోగు చేసుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎవరినీ సహాయం అడగకుండా ట్రస్టు సభ్యులే తమ సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.


అంత్యక్రియల్లో ట్రస్టు సభ్యుల సహాయక చర్యలు (ఫైల్)

సహారా సేవలివీ..

- పేద కుటుంబాలలో యువతుల పెళ్లి ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం.
- స్థానిక నాయక్‌వీధికి చెందిన రెహమాన్ (41) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా అతడికి వైద్య ఖర్చులకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందించారు.
- కరోనా కష్టకాలంలో 9 0రోజుల పాటు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం.
- మండలంలోని గండబోయనపల్లెకు చెందిన చిన్నారి తెహరీన్ (8), సయ్యద్‌బాషాలు అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.45 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.
- 200 నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి ఆదివారం రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ.
- మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 60 మందికి శస్త్ర చికిత్సలు చేయించారు.
- కొవిడ్ మృతులకు ట్రస్టు ఖర్చులతో అంత్యక్రియలు.
- ప్రతి ఏటా నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ.
- క్షయ వ్యాధితో బాధపడుతున్న ఆరుగురు రోగులకు వైద్య ఖర్చులతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీ.

తోటి వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి..



మనకున్నంతలో తోటి వారికి సాయం అందించి ఆదుకోవడంలో నిజమైన సంతృప్తి కలుగుతుంది. స్నేహితులంతా కలిసి సేవే పరమావధిగా సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. సేవా కార్యక్రమాల ద్వారా పెద్దల అభినందనలు, ఆశీర్వాదాలు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. ప్రస్తుత సమాజంలో నిస్వార్థ సేవతో నిరుపేదలకు సాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నదే మా మిత్ర బృందం విజ్ఞప్తి.

- సాదిక్‌అహ్మద్, సహారా ఛారిటబుల్ ట్రస్టు, అధ్యక్షుడు, వాల్మీకిపురం


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు


అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు బృందం (ఫైల్)

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన రైల్వేకోడూరు నారాయణ స్కూలు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో జరిగిన పోటీల్లో నారాయణ స్కూలుకు చెందిన వై.లాస్య, పి.పవన్, రూపశ్రీ, ఎస్.మేధ ప్రతిభ ప్రదర్శించారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ వెంకటసుధీర్ వివరించారు. ఆయా విద్యార్థినులను ఎస్ఐ నవీన్‌బాబు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ నవీన్‌బాబు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె విద్యార్థి



లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజేంద్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 22న కడప మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 క్రికెట్ విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. వ్యాయాయ ఉపాధ్యాయుడు చక్రపాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు...

సంబేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పావని, గంగాదేవి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. కడప మున్సిపల్ స్టేడియంలో ఈనెల 22న జరిగిన బాలికల అండర్-17 కబడ్డీ పోటీలో పావని, అండర్-14 విభాగంలో గంగాదేవి ప్రతిభ ప్రదర్శించారని వివరించారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు రాయచోటిలో అండర్-17 పోటీలు నవంబరు 1 నుంచి 11 వరకు బాపట్ల జిల్లాలో అండర్-14 పోటీలు జరుగుతాయన్నారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన పావని, గంగాదేవి

జిల్లా స్థాయి క్రీడల్లో జ్యోతిబాపూలే విద్యార్థుల ప్రతిభ

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. అండర్-19 200 మీటర్ల పరుగులో పి.వర్షిత, 1500 మీటర్లలో హేమలత, ఫోరికే పరుగులో కె.ఆశ, డిస్క్ త్రోలో ఎస్.నిత్య, జావెలిన్ త్రోలో ఎం.యోగిప్రభ, షాట్‌పుట్‌లో ఎస్.నిత్య, ఖోఖోలో పి.సాయి హారిక, ఎస్.నిత్య, పి.వర్షిత, కె.ఆశ, పి.వనిత, క్రికెట్‌లో సి.హేమలత, చెస్‌లో ఎస్.పవిత్ర, హ్యాండ్‌బాల్‌లో కె.ప్రతిభ, ఎస్.నిత్య, త్రోబాల్‌లో కె.ప్రతిభ, టెన్నికాయిట్‌లో బి.గ్రీష్మ, జి.మాధురి, వాలీబాల్‌లో టి.తేజ, అండర్-17 విభాగం కబడ్డీలో ఎం.అమృత, క్యారమ్స్‌లో సి.రేఖ, క్రికెట్‌లో వి.భవ్యశ్రీ, అండర్-14 కబడ్డీలో వై.సంజీవ, క్యారమ్స్‌లో ఎల్.దివ్యశ్రీలు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.


ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని జాస్మిన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ సెలక్షన్స్‌లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


విద్యార్థిని జాస్మిన్‌తో పీడీ నీలకంఠరావు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న రాఘవేంద్ర

కురబలకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని ప్రైవేట్ అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలో గుర్రంకొండకు చెందిన విద్యార్థి రాఘవేంద్ర చదువుతున్నాడు. కాగా ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం తను చదువుతున్న కళాశాలలోనే విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స అందించారు. కాగా విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రంగోత్సవం'లో గురుకుల పాఠశాలకు అవార్డులు

కలికిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ కేంద్రంగా ఏటా జాతీయ స్థాయిలో విద్యార్థుల మధ్య జరిగే సృజనాత్మక కళలపై జరిగే పోటీలో ఈ ఏడాది స్థానిక జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు బహుమతుల పంట పండింది. గత జూలై నెలలో జరిగిన పోటీల్లో ఈ పాఠశాల నుంచి మొత్తం 80 విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో 24 మందికి వివిధ రకాల అవార్డులు లభించాయి. వాటిని బుధవారం నిర్వాహకులు పాఠశాలకు పంపించారు. ఆర్ట్ మెరిట్ కేటగిరీలో 10వ తరగతి చదువుతున్న వి.కావ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. హ్యాండ్ రైటింగ్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని ఎల్.అంజలికి కన్సొలేషన్ బహుమతి లభించింది. ఇవి కాకుండా డ్రాయింగ్, థంబ్ పెయింటింగ్, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డు తయారీ, కేరికేచర్ పోటీల్లో మరో 22 మంది అవార్డులు పొందారు. ఇందులో 10 మంది విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్, 8 మందికి సిల్వర్ మెడల్స్, నలుగురికి కాంస్య పతకాలు అందాయి. గరిష్ట సంఖ్యలో విద్యార్థినులు బహుమతులు సాధించిన కారణంగా 'బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్' అవార్డు గురుకుల బాలికల పాఠశాల దక్కించుకుంది. పాఠశాల నిర్వహణలో ప్రతిభను కనబరిచిన ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ కూడా ప్రశంసాపత్రం, జ్ఞాపికను పొందారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రంగోత్సవం నిర్వాహకులు పంపిన మెడల్స్, ప్రశంసాపత్రాలను విజేతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినికి అవార్డు పంపిణీ చేస్తున్న సోమశేఖర్

రైతాంగాన్ని ఆదుకుంటాం

● ఎంఎస్ఎంఈని జిల్లాకు రప్పిస్తాం ● కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీని సహించం
● అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి ● జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు

(5వ పేజీ తరువాయి)

సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వారి మేనిఫెస్టోను తుంగలో తొక్కిందన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీ అని జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసారే కాని ఉద్యోగాల భర్తీ మాత్రం జరగలేదన్నారు. ఇక పోతే అమ్మ ఒడిని 2019లో ఇవ్వకుండా వంచనచేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అజెండాపై ఫైర్

జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాపై టీడీపీ ప్రజాప్రతినిధులు వరదరాజులరెడ్డి, రామగోపాల్‌రెడ్డి ఫైర్ అయ్యారు. అజెండా ఇవ్వకపోతే తాము ఏమి మాట్లాడాలని ప్రశ్నించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి మాట్లాడుతూ అజెండాను సభ్యులకు రిజిస్టర్ పోస్టు చేశామని అనగా ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు.. అజెండా పంపినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని రామగోపాల్‌రెడ్డి ఘాటుగా మాట్లాడారు. మీ కోరిక మేరకు పంపుతామని మైథిలి పేర్కొనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంపడం తప్పనిసరి అన్నారు. సమావేశం ఉదయం 10 గంటలకని 11 గంటలకు ప్రారంభించడం ఏ సంప్రదాయమని చురకలంటించారు. ఈసారైనా సమావేశాన్ని అనుకున్న సమయానికి ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను రానున్న సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. ఈ సారి సమావేశంలో చర్చకు జడ్పీ శాఖను కూడా చేర్చాలన్నారు.

ఎవరేమన్నారంటే..

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై వాడీవేడీ చర్చ కొనసాగింది. అజెండా అంశాలవారీగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించగా పలువురు సభ్యులు లెవనెత్తిన అంశాలపై అధికారులు సమాధానమిచ్చారు.

- అక్టోబర్ 23న క్యాబినెట్ సమావేశం ఉందని ముందే తెలుసుకదా.. మంత్రులు లేరు సీఈవో లేరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎవరిస్తారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.
- జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామంలోని వంక సమీపంలో దాల్మియా యాజమాన్యం సిమెంట్ ఫ్యాక్టరీని 2006లో ఏర్పాటుచేసిందన్నారు. దీని కారణంగా వంకకు వరద వచ్చినప్పుడు నీరు ప్రవహించడానికి వీలులేకుండా ఉండడం వలన సమీపంలోని ఎస్సీకాలనీ, నవాబ్‌పేటతో పాటు 400 ఎకరాలు ముంపునకు లోనవుతోందని బాధిత రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు.
- రాజంపేట నియోజకవర్గంలోని అన్నమయ్య ప్రాజెక్టుకు పునర్‌నిర్మించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి తగిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే అక్కడి ప్రజలకు తాగురు, రైతాంగానికి సాగు నీరు అందుతుందన్నారు.
- రాష్ట్రప్రభుత్వం రైతులకు సబ్సిడీద్వారా అందిస్తున్న విత్తనాలు బయటి మార్కెట్ కన్నా అధిక రేట్లు ఉన్నాయని పెండ్లిమర్రి, సీకేదిన్నె, కమలాపురం జడ్పీటీసీలు పిట్టుబాలయ్య, నరేన్‌రామాంజులరెడ్డి, వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు.
- వీరపునాయునిపల్లె మండలంలో ఇద్దరు ముగ్గురు వీఆర్‌వోలు మాత్రమే ఉన్నారని ఈ కారణంగా మండలంలో రెవెన్యూసేవలు పూర్తి స్థాయిలో అందడంలేదని ఎంపీపీ అన్నారు. అలాగే గంగిరెడ్డిపల్లెను రెవెన్యూ విలేజ్‌గా మార్చాలని, వెబ్‌ల్యాండ్‌లో ఆ గ్రామమే చూపడంలేదని తెలిపారు.
- ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులలో వందశాతం కాన్పులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పోరుమామిళ్ల పీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉందని ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా సమయపాలన పాటించడంలేదని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. చెన్నూరు పీహెచ్‌సీని సీహెచ్‌గా మార్చినప్పటికి తగినంతమంది వైద్యులు లేరని సాయంత్రం 4 గంటలకే తాళాలు వేసుకుని వెళ్తున్నారని ఎంపీపీ తెలిపారు.
- పశువుల దాణా రేటును తగ్గించి పాడిరైతులను ఆదుకోవాలని పెండ్లిమర్రి, చక్రాయపేట జడ్పీటీసీలు పిట్టుబాలయ్య యాదవ్, శివప్రసాద్‌రెడ్డి కోరారు.
- జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే భర్తీ చేసి 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఎమ్మెల్సీతో పాటు పెండ్లిమర్రి జడ్పీటీసీ బాలయ్య యాదవ్ కోరారు. కమలాపురం బ్రిడ్జి పనులను త్వరలో పూర్తిచేయాలని, చిన్నచెప్పలి నుంచి సంగమేశ్వర దేవస్థానం రోడ్డు పనులను పూర్తిచేయాలని, కమలాపురంలో ఇండోర్ స్టేడియం పనులను పూర్తిచేయాలని, కమలాపురం ఆసుపత్రిలో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ కోరారు.
- ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలుగా మంచిచేసేందుకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను జిల్లా యంత్రాంగం పరిధిలో లేనివాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.
- జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలోనే ఆదర్శంగా రూపొందించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. శాఖలవారీగా అన్నిరకాల అభివృద్ధి పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా జిల్లా పరిషత్ అన్నిరకాల చర్యలను చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, అన్నమయ్య జిల్లా డీఆర్‌వో సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణానికి మంగళం పలికినట్లేనా?

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం నిర్మాణానికి మంగళం పలికినట్లు కనిపిస్తోందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ సమగ్రాభివృద్ధికోసం 2008-09 రైల్వే బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించే షరతుతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. 2010లో పనులకు శంకుస్థాపన జరగ్గా మొదటి దశ పని రూ.351కోట్లతో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్లు పూర్తైందన్నారు. ఇంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయలేదన్నారు. రైల్వేశాఖ పనులు నిలిపివేసిందన్నారు. ఇంతటితో ఆగక ఈప్రాజెక్టు వద్దు.. దీనికి బదులు ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ లైన్ మంజూరు చేయాలని వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. ఈలోపు వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రైల్వే ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారన్నారు. అన్ని ప్రాజెక్టులకు గ్రీన్ స్నిల్ ఇచ్చారు కానీ కడప-బెంగళూరు లైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదన్నారు. రైల్వే అలైన్‌మెంటులో మార్పులు జరిగాయని, దీనిపై మరింత చర్చించి నిర్ణయ తీసుకోవాని చెప్పి పక్కనపెట్టడం జరిగిందన్నారు. దీని బట్టి చూస్తే ఈ ప్రాజెక్టుకు మంగళం పాడినట్లు కనిపిస్తోందన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వీసీ విజయ్‌కుమార్, డైరెక్టర్ తదితరులు

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఈనెల 20న నిర్వహించిన ఆర్జీయూకేటీ అంతర్ కళాశాలల పోటీల్లో వివిధ క్రీడాంశాలలో ఆర్కేవ్యాలీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆలిండియా/సౌత్‌జోన్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. బాస్కెట్ బాల్ పోటీలకు ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు, బ్యాడ్మింటన్ (షటిల్)లో ఒక బాలుడు, ఇద్దరు బాలికలు, కబడ్డీకి ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారన్నారు. వీరిని ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ విజయ్‌కుమార్, ఏఓ రవికుమార్, పీడీ పీవీ రమణారెడ్డి, వి.బాల ఓబయ్య, ఎస్‌కే షంషాద్ బేగంలు అభినందించారు.

ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు


ఒలింపియాడ్‌లో సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం రమణయ్య

సికెదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఒలింపియాడ్ మేథమేటిక్స్ క్వాలిఫైడ్స్‌లో బృందావనం శ్రీచైతన్య విద్యార్థులు ఆరుగురు తమ సత్తా చాటినట్లు విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. జాతీయస్థాయిలో సెప్టెంబరు నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన గణితశాస్త్ర ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు నవనీత, జ్వలిత, జగన్నాధం, యశశ్వి, పునీత్‌రెడ్డి, ఎస్‌ఎండీ సైప్ అనే విద్యార్థులు అర్హత సాధించారని, ఇది శ్రీచైతన్య విద్యాసంస్థలతో పాటు కడప జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందన్నారు. భారతదేశంలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఎక్కువ మంది అర్హత సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ సాధించడం పట్ల విద్యాసంస్థల డైరెక్టర్ సీమ, నాగేంద్ర అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భాస్కర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

పరిశోధనలపై దృష్టి అభినందనీయం


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించడం అభినందనీయమని ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతుశాస్త్ర విద్యార్థి నిహాంత్ పేపరు ప్రజంటేషన్‌పై బెస్ట్ అవార్డు లభించినందుకు ఆయనను అభినందించారు. విదర్భ మహావిద్యాలయ, బుల్దన గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆరోగ్యకర జీవితాలు, ఆరోగ్యకర సమాజం, వ్యాధులు వాటి నివారణ, అరికట్టే విధానంపై జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వై.సావిత్రి పర్యవేక్షణలో విద్యార్థి నిహాంత్ పత్రసమర్పణ చేశారన్నారు. దీనికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. జంతుశాస్త్రం హెచ్‌వోడీ డాక్టర్ రవిశేఖర్, అధ్యాపకులు డాక్టర్ నాగేంద్ర, మహేశ్, అపర్ణ, విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేశ్, డాక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టాడంటూ కరస్పాండెంట్‌ను చితకబాదిన తల్లిదండ్రులు

పులివెందుల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఒక విద్యార్థిని పైశాచికంగా చితకబాదడంతో.. విద్యార్థి తల్లిదండ్రులు కుటుంబసభ్యులతో వచ్చి అతడికి దేహశుద్ధి చేశారు. పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు శరణ్య ఆసుపత్రి వెనక అనధికారికంగా ఎక్సలెంట్ నాగార్జున ఇంగ్లీషుమీడియం హైస్కూలు నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంస్థ కరస్పాండెంట్ కుమార్ అదే పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థి రహీంను చితకబాదాడు. దీంతో బుధవారం విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఇలా కొడితే ఎలా అని ప్రశ్నించగా అతడు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థి తల్లిదండ్రులు కరస్పాండెంట్ కుమార్‌పై దాడి చేశారు. పాఠశాలలోని సహ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను అడ్డుకుని సర్దిచెప్పి పంపించారు.

ఈ విషయంపై కరస్పాండెంట్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అలాగే సంబంధిత పోలీసుస్టేషన్‌లో సీఐని వివరణ కోరగా, ఈ వ్యవహారం తమదృష్టికి రాలేదన్నారు. కాగా ఈ వీడియో సోషల్ మీడియాలో బుధవారం రాత్రి వైరల్ అయింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మత్తు కోసం...

- యువత మాత్రలు, సొల్యూషన్‌ల వినియోగం
- రూ.10 మాత్ర రూ.300కు విక్రయం
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువు
- ఇలాగే కొనసాగితే భవిష్యత్తు అంధకారమే


మత్తు కోసం యువత వాడుతున్న ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు



మత్తుకు యువత చిత్తవుతున్నారు. మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో.. సినిమాల్లో హీరోలు చేసే మత్తు స్టైల్స్ చూసి వాటిని అనుకరిస్తున్నారు. సరదాగా సిగరెట్లు, మద్యంతో మొదలై క్రమంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. అందులో నుంచి బయట పడలేక బానిసలుగా మారుతున్నారు. మద్యం, గంజాయి దొరకని వారు ఇప్పుడు మత్తు కోసం నానా పాట్లు పడుతున్నారు. కొత్తగా మత్తు ట్యాబ్లెట్లను వినియోగిస్తున్నారు. సంప్రదాయ మత్తు పదార్థాలు (మద్యం, గంజాయి) అందుబాటులో లేని వారు ఇతర ప్రమాదకరమైన మత్తు పదార్థాలను వినియోగిస్తూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువగా 14 నుంచి 22 సంవత్సరాల మధ్యవయస్కులే బానిసలుగా మారుతుండడం గమనార్హం. పరిస్థితి విషమించే వరకు తల్లిదండ్రులకు తెలియకపోవడంతో పలు కుటుంబాలు వేదన పడుతున్నాయి.

కడప (క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయిలాంటి వాటితో పాటు బోనోఫిక్స్‌లాంటి ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. వాహనాల టైర్ల పంక్చర్లకు ఉపయోగించే సొల్యూషన్ పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. అల్మాస్‌పేట, సాయిపేట, నకాశ్, రవీంద్రనగర్, ఖలీల్‌నగర్ వంటి ప్రాంతాల్లో యువకులు ఎక్కువ శాతం ట్యాబ్లెట్లు వినియోగిస్తున్నారు. దీంతో రూ.10లు చేసే మాత్ర రూ.300కు విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం, గంజాయిలాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. మెడికల్ స్టోర్‌లే కాదు కొన్ని సెల్‌పాయింట్లలో రూ.10 విలువ చేసే మాత్రలు రూ.300లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారు ఎక్కువయ్యారు. కడపకు చెందిన ఓ యువకుడు గల్ఫ్ నుంచి కడపకు వచ్చాడు. ఇక్కడ మత్తుకు అలవాటుపడ్డాడు. సమయానికి ట్యాబ్లెట్ అందివ్వలేదని చెప్పి మరో యువకున్ని చావబాదాడు. మత్తులో ఏం చేస్తున్నామో అనే విషయం వారికే అర్థం కాకుండా పోతోంది. కొంత మంది గొడవలకు దిగితే మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.

డాక్టరు ప్రిస్కిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసు కుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ఫ్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనోట్రిల్ 0.5, ఇలాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోతే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.


ట్యాబ్లెట్ వాడుతున్న యువకునికి కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ

ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవాలి

- అనుమతులు లేని షాపులు సీజ్
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలంతా ఆనందంగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, సంబంధిత అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు డివిజన్‌లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇస్తామన్నారు. ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల భద్రతా చర్యలు తప్పక పాటిస్తే సాంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బాణసంచా దుకాణాలను నిర్వహించకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు జరగాలన్నారు. అనుమతులు లేకుండా బహిరంగంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే విక్రయదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓలు జిల్లాలోని అన్ని బాణ సంచా గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి అనుమతులు, రెన్యువల్స్ ఉండేలా చూడాలన్నారు. తమ పరిధిలో లైసెన్సులు ఇచ్చే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కార్యక్రమంలో ఆర్డీఓలు పి.జాన్‌ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, భానుశ్రీ, నగర కమిషనరు మనోజ్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి సాయిధర్మారావు, సమాచారశాఖ ఏడీ వేణుగోపాలరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి, కడప తహశీల్దారు నారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

ఆటో ఢీ.. మహిళ మృతి

చక్రాయపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమార్లకాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లవెంకటగాల్ల కమలమ్మ(62) మృతి చెందారు. ఎస్‌ఐ కృష్ణయ్య వివరాల మేరకు.. కుమార్లకాల్వ హరిజనవాడ వాసి కమలమ్మ వేంపల్లె వైపు వెళ్తున్న టీవీఎస్ మోపెడ్‌లో వేంపల్లెకు వెళ్లేందుకు ఎక్కింది. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో ఆమె కిందపడి బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేంపల్లెకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీ.. ఒకరి మృతి


మృతి చెందిన బాషా

కలసపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగరాయపల్లె గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాషా (50) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన బాషా ద్విచక్రవాహనంలో ఎగువతంబళ్లపల్లె గ్రామంలో వివాహానికి వస్తుం డగా తుఫాను వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కలసపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీ లించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప హౌసింగ్‌బోర్డుకాలనీలో చోరీ

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో రవికుమార్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. కరెంటు ఆఫీసులో పనిచేస్తున్న రవికుమార్ ఈనెల 21న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఇంటికి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 50 తులాల బంగారు నగలను అపహరించారు. ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు రవికుమార్‌కు సమాచారం అందించారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్కానిర్వాహకుడు అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోచంపేట వద్ద మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు మోచంపేటకు చెందిన షేక్ మహ్మద్ ఖాసిం మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారంవచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బందితో మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.14450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ మరణానికి కారణమైన వ్యక్తికి ఏడేళ్లు జైలుశిక్ష

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బుడ్డాయపల్లె గ్రామంలో అద్దె ఇంట్లో ఉన్న వెంకటేశ్ ఓ మహిళ మృతికి కారణం కావడంతో అతడికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ తీర్పునిచ్చినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా వీకోట మండలం ఎల్లగరం గ్రామానికి చెందిన వెంకటేశ్ జీవనోపాధి కోసం కడపలో నివాసం ఉంటున్నాడు. తిరుపతికి చెందిన ఓ మహిళ చనిపోయేందుకు ప్రేరేపించడంతో పాటు ఆమె చావుకు కారణమైన వెంకటేశ్‌పై 2021లో రిమ్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

అదుపు తప్పి లోయలో పడిన ట్యాంకర్



సికెదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లో బుధవారం జరిగిన ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన మేరకు వివరాలిలా.. చిత్తూరు నుంచి కడపకు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కడప - రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ దిగుతూ 4వ మలుపు వద్ద అదుపు తప్పడంతో లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో క్లీనర్ కుమరన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకాశవాణిలో నేడు క్షేత్ర దర్శనం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రతి గురువారం ఉదయం 7.15 గంటలకు ప్రసారమయ్యే కాంతిరేఖలు కార్యక్రమంలో క్షేత్ర దర్శనం ప్రసారం అవుతుందని స్టేషన్ డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఈనెల 24 నుంచి ప్రతి గురువారం ప్రసారమయ్యే కార్యక్రమంలో కడపకు చెందిన చరిత్ర అధ్యాపకులు ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ ఐఎల్‌ఎన్ చంద్రశేఖర్‌రావు కడప, అన్నమయ్య జిల్లాల్లోని ప్రముఖ ఆలయాల గురించి ప్రస్తావిస్తారని ఆయన తెలిపారు.

పీబీఆర్‌లోకి...ఒక టీఎంసీ వరదనీరు


ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీరు


లింగాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్ (పీబీఆర్)లోకి ఒక టీఎంసీ వరదనీరు చేరినట్లు ప్రాజెక్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు రెండు రోజుల నుంచి డ్యాంలోకి నీటి చేరిక ప్రారంభమైందన్నారు. 500 క్యూసెక్కుల నుంచి గరిష్ఠంగా పదివేల క్యూసెక్కుల పైగానే వరదనీరు వచ్చిందన్నారు. బుధవారం సాయంత్రానికి నాలుగువేల క్యూసెక్కుల వరదనీరు చేరుతోందని.. క్రమంగా నీటి ప్రవాహం పడిపోతోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.25 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

గండికోట నుంచి 12 వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి బుధవారం 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కుల కృష్ణాజలాలు, వరద నీరు మరో 3000 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. అదేవిధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి వడుదల

మైలవరం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు మైలవరం జలాశయం డీఈ నరసింహమూర్తి బుధవారం తెలిపారు.గండికోట జలాశయం నుంచి మైలవరానికి నీరు వచ్చి చేరుతుండటంతో పెన్నా నదికి పదివేల క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 30 క్యూసెక్కులు, దక్షణ కాల్వకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అద్దె/లీజ్

కడప టౌన్ చిన్నచౌక్, అంజనేయస్వామి గుడి ఎదురుగా, మెయిన్‌రోడ్‌లో North ఫేసింగ్ కమర్షియల్ /రెసిడెన్షియల్ 10 సెంట్ల స్థలములో ఇల్లు పార్కింగ్ ఫెసిలిటీ కలదు. Poly Clinic/Offices/ Commercial ప్రాముఖ్యత 9640565942, 8885668830
Ajc-196227

WANTED

A.P. Govt. Reg. పొందిన Riyaz Promotions నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిప్లమా P/F అయిన 25 సం॥లోపు యువతీ యువకులు కావలెను. సంపాదన : నెలకు 13000 to 25000, రూం+భోజనం ఫ్రీ, సెల్: 79893 89001
Ajc-196228

CHANGE OF NAME

I BATHENA BHARATHI (New name) W/o G. RAVI KUMAR Resident of D/NO 45/150-110, Tharakaramanagar Kadapa city YSR (dist). my Son GILLELLA Joshith 9th Class Sri pm kvs Kadapa in school records my name mentioned as GILLELLA BHARATHI (OLD NAME) W/o GILLELLA RAVI KUMAR correct name is BATHENA Bharathi
AJC-000

బంగారం కొనబడును

మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్,ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్)గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 198452

పాఠకులకు ముఖ్య గమనిక


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కంటి వైద్యశాలను సద్వినియోగం చేసుకోండి


కంటివైద్యశాలను ప్రారంభిస్తున్న సీఎంఓ

కమలాపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ముందుంటామని భారతి సిమెంటు పరిశ్రమ చీఫ్ మేనేజరు సాయి రమేశ్ తెలిపారు. స్థానిక మూడురోడ్ల కూడలిలో ఎర్రగుంట్ల రోడ్డులో పుష్పగిరి కంటి వైద్యశాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో కంటి వైద్యశాలను ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలు కంటి వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా వైద్యం అందించడం, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు ఉచితంగా అందిస్తామన్నారు. దత్తత గ్రామాల్లో పాఠశాలల్లో ఫర్నీచరు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, పేర్ల భార్గవ్‌రెడ్డి, సీఎస్ఆర్ నీతేశ్వర్, పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.





కషాయాల పిచికారీతో ఖర్చు తగ్గించవచ్చు


చెన్నూరులో జీవామృతం తయారీలో యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటయ్య

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో కషాయాలు వాడి తెగుళ్లను నివారించుకుంటే ఖర్చు తగ్గుతుందని చెన్నూరు యూనిట్ ఇన్‌చార్జ్ కె.వెంకటయ్య రైతులకు సూచించారు. పురుగుమందుల వాడకంలో జరిగే నష్టం, కషాయాలు వాడకం వల్ల కలిగే ఫలితాలపై దుగ్గనపల్లెలో రైతులకు అవగాహన కల్పించారు. కషాయాల తయారీ, ఉపయోగం, ఖర్చు వంటి వాటిపై రైతులకు వివరించారు. జీవామృతం వల్ల రైతులకు పెద్దగా ఖర్చు ఉండదని వాటితో కలిగే ప్రయోజనం ఎక్కువన్నారు. ఆకులను తుంచి వాటి రసంతో పిచికారీ చేయడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కషాయాల తయారీ, నిల్వ, వినియోగం, తద్వారా కలిగే లాభలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందికె.శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతు రశీదులు పొందండి

కమలాపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించి పంటలు సాగు చేసి నమోదు చేయించుకున్న ప్రతి రైతు రశీదులు పొందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి సూచించారు. బుధవారం పెద్దచెప్పలి రైతు సేవా కేంద్రాన్నుద్దేశించి ఆయన మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో కమలాపురం మండలంలోని 16 రైతు సేవాకేంద్రాల్లో 1760 మంది రైతులు పంట నమోదు చేయించుకున్నారన్నారు. వల్లూరు మండలంలో 2465 మంది రైతులు, వీరపునాయునిపల్లెలో 4481 మంది, ఎర్రగుంట్ల పరిధిలో 2218 మంది రైతులు ఈ పంట నమోదు చేసుకున్నారన్నారు. ఏఓ నరస్వతి ఎర్రగుడిపాడులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి దస్తగిరి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అనిమెల రైతుసేవా కేంద్రం తనిఖీ

వీరపునాయునిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనిమెల రైతుసేవా కేంద్రాన్ని ఏఓ శ్యామ్‌బాబు తనిఖీ చేశారు. ఖరీఫ్ 2024 సీజన్‌లో పంటలు సాగుచేసి నమోదు చేయించుకున్న ప్రతి రైతూ రసీదులు పొందాలని సూచించారు. మండల వ్యాప్తంగా 15రైతు సేవా కేంద్రాల్లో 4487 మంది రైతులు 16446.53 ఎకరాల్లో పంటలు సాగుచేశారని, సాగుచేసిన ప్రతి పంటను వందశాతం నమోదు చేశామన్నారు. పంట సాగు చేసిన రైతుకు ఏపంట సాగుచేశాడు, ఎంత విస్తీర్ణంలో సాగుచేశాడన్న వివరాలతో కూడిన రసీదులకు సంబంధిత వ్యవసాయ సహాయకులు అందిస్తారన్నారు. 99.84శాతం ఈకే వైసీ చేయించామన్నారు. రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి రసీదులు పొందాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కోనాయిపల్లెలో...

పెండ్లిమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోనాయిపల్లెలో ప్రకృతి వ్యవసాయపద్దతిలో సాగుచేసిన మినుము పంటను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆ గ్రామంలో నిర్వహించిన పొలంపిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ నీమాస్త్రం వలన కలిగే ఉపయోగాలు వివరించారు. ఫారంపాండ్ ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, విస్తరణాధికారి గంగాధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు చిట్టి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ


శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ

పెండ్లిమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాతసంగిపల్లెలో మండల వ్యవసాయాధికారి ఓబులేసు శనగ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 1641 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని, వాటిని రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి గంగాధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయసహాయకురాలు చిట్టి, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం బేతనియా ప్రార్థనా మందిరంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ పాస్టర్లకు ప్రస్తుతం ఉన్న టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చిందన్నారు. క్రిష్టియన్ మైనార్టీ డిపార్ట్‌మెంటుకు బడ్జెట్ కేటాయించి సమస్యలు పరిష్కరించాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. జిల్లా కమిటీ గౌరవ సలహాదారులు శ్యామ్యుల్‌బాబు, జిల్లా సెక్రటరీ శ్యామ్యుల్, ట్రెజరర్ సుధాకర్, ఉపాధ్యక్షులు విజయశేఖర్, ప్రభుదాస్, కుమార్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి పూజలు


శివాలయం నిర్మాణానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మృత్యుంజయకుంటలో శివాలయం నూతన నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మృత్యుంజయకుంటలో నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి సమీక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు.

ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి కడప జిల్లా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

'నాశిరకం పనులతో వేంపల్లె అస్తవ్యస్తం'

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఒక ప్రణాళిక అంటూ లేకుండా పనులు చేపట్టడంతో వేంపల్లె అస్తవ్యస్థంగా తయారైంది, కోట్లాది రూపాయలతో నిర్మించిన జిల్లా పరిషత్ బాల బాలికల, ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులు నాశిరకంగా ఉండడంతో ఉరుస్తున్నాయని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి ఆరోపించారు. ఒక్కసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేంపల్లెలో పర్యటించి ఐదేళ్లలో జరిగిన నిర్వాక పనులను పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం మునిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతలు సొంత ఆదాయం కోసం పాటుపడ్డారే తప్ప అభివృద్ధి పూర్తిచేయాలనే ముందుచూపు లేకపోవడం దారుణమన్నారు.


జాతీయస్థాయి ఖోఖో పోటీలకు వేంపల్లె విద్యార్థి ఎంపిక

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె చైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.ధర్మప్రభాకర్‌రెడ్డి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. సికెదిన్నె మండలం బయనపల్లె ఎస్‌వీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

గొందిపల్లెలో విగ్రహ ఏర్పాటుకు పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వేముల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గొందిపల్లెలో అభయ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గొందిపల్లె సర్పంచు దేవననారాయణమ్మ, దేవనరామాంజనేయులు, కబోజి రామకృష్ణ, గడ్డం సదాశివుడు, గడ్డం మునలయ్య, ఎర్రగుండు రమణ, వేముల ఓబులేసు, బీసీ సెక్రటరీ గంగాదర్‌యాదవ్, ప్రజలు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను కాపాడాలి


ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న దృశ్యం

పెండ్లిమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరు గ్రామంలో ప్రభుత్వ భూములు రోజురోజుకూ అన్యాక్రాంతమవుతున్నాయని వెంటనే కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న భూములను వ్యవసాయ కార్మిక సంఘం మండల నేతలు పరిశీలించారు. గ్రామంలో జగనన్న కాలనీ పక్కన సర్వేనెంబర్ 387-2ఎలో 1.70సెంట్లు ప్రభుత్వభూమి డీకేటీ ఉందన్నారు. ఇళ్ల స్థలాలకు విలువైన భూమిని నేడు దౌర్జన్యంగా కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆ స్థలంలో గ్రావెల్ వేసి ప్లాట్లుగా అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు హెచ్చరిక బోర్డు వేయించారన్నారు. నేడు బోర్డును తొలగించి ఆ భూమిని కొందరు వ్యక్తులు అమ్ముకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు జిల్లా రెవెన్యూ ఆఫీసర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ వినతులు సమర్పించింది. హెచ్చరిక బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని కోరినా తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నేతలు శ్రీను, సుబ్బరాయుడు, గంగన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వీసీని తొలగించే వరకు పోరాడతాం

ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన


వైవీయూ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని వెంటనే తొలగించాలని లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూ ప్రధాన ద్వారం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి గతంలో క్రిష్ణ యూనివర్శిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయన్నారు. యూనివర్శిటీ గెస్ట్‌హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయన్నారు. ఇటువంటి లైంగిక ఆరోపణలున్న వ్యక్తి వైవీయూలో ప్రొఫెసరుగా ఉండడమే కాకుండా వైస్‌చాన్సలరుగా నియమించడం బాధాకరమన్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటువంటి ఆరోపణలున్న అధికారిని వెంటనే తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నేతలు తేజా, చంద్ర, పీటర్, రాజేశ్, అశోక్ పాల్గొన్నారు.

నూతన పద్ధతులు పాటించాలి

వేముల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శనగ సాగులో నూతన యాజమాన్యపద్దతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధిచవచ్చని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. వ్యవసాయాధికారి పెద్దజూటూరు ఆర్ఎస్‌కేలో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కలిసి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. శనగలో వచ్చే ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు నివారణకు చర్యలు చేపట్టాల సూచించారు.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ ఘనంగా చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసుకు వినతి

కడప మారుతీనగర్ అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): నగర క్రిష్ణా థియేటర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని జరపాలని ఆర్టీసీ ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డిని కలిసి వినితి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ నగర సుందరీకరణలో భాగంగా పాత విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని నెలకొల్పారన్నారు. విగ్రహావిష్కరణచేయలేదన్నారు. జనవరి 17న అప్పటి డిప్యూటీ సి.ఎం. అంజాద్ బాష సీమ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా విగ్రహానికి వున్న ముసుగును తొలగించి పూలమాల వేశారని ఆరోపించారు. వాసు స్పందించి త్వరితగతిన ఆవిష్కరణ జరుపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం. రెడ్డయ్య, వేణుగోపాల్, పాల్గొన్నారు.

హంతకుడిని ఉరి తీయాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ జ్యోతి

కడప కలెక్టరేట్ 23 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో విద్యార్థిని హత్య గావింపబడడం దురదృష్టకరమని హంతకుడిని ఉరి తీయాలని డీసీసీ అధ్యక్షురాలు ఎస్.డి. విజయజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోల్‌కత్తలో డాక్టర్ ఘటన మరువక ముందే బద్వేలులో ఘటన జరగడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో సమస్యలు తీరవని, ఆడ పిల్లలను తాకితేనే కఠిన శిక్షలు తప్పవనే రీతిలో చట్టాలను తేవాలన్నారు. హంతకుడికి ఉరి శిక్ష పడడమో లేక అచేతన స్థితిలో జీవించేలా చేస్తే మిగతా వారు తప్పు చేయరన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి

సికెదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని పవర్‌గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హరివెంకటకుమార్ తెలిపారు. జె.కొత్తపల్లె హైస్కూలు, బోడెద్దులపల్లె ఉర్దూ హైస్కూలులో పెద్దకాంపల్లెలోని పవర్‌గ్రిడ్ సంస్థ విద్యార్థులకు అవినీతి రహిత సమాజంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఆయన మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులని, భవిష్యత్తు సమాజం ఉన్నత నైతిక విలువలు, మంచి సంప్రదాయాలు రావాలంటే అవినీతి రహిత సమాజ అభివృద్ధే కారణమన్నారు. పవర్‌గ్రిడ్ అధికారులు ప్రమోద్, రమేష్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆల్ ఇండియా టెక్నికల్ వైస్‌చైర్మన్‌గా ఖలీద్

కడప నాగరాజుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) డేటా అండ్ టెక్నాలజీ విభాగం ఆల్ ఇండియా వైస్‌చైర్మన్‌గా ఖలీద్ సైపుల్లా నియమింపబడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఖలీద్ సైపుల్లా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఖలీద్ సైపుల్లా కడపలోని మదీన ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ చదివారు. ఇతను అనుభవజ్ఞుడైన సాఫ్ట్‌వేర్ నిపుణుడు. గూగుల్, ఇన్ఫోస్కో, నెస్, డెల్ వంటి ప్రముఖ సంస్థల్లో 20 ఏళ్లకు పైగా ఐటీ పరిశ్రమలో పనిచేసిన అనుభవం, డేటా అనలిటిక్స్, టెక్నాలజీ రంగాల్లో ఆయన నైపుణ్యాలను గుర్తించి కాంగ్రెస్ పదవిని కట్టబెట్టిందన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ అక్టోబరు 23. (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టిడే ఇంటర్ డిస్ట్రిక్స్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 316 పరుగుల భారీ స్కోర్ సాధించి డిక్లేర్ చేసింది. రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 330 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో విశాఖ- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 112 పరుగులకు ఆలౌట్ కాగా విశాఖ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు 22.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 82 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 82 పరుగులతో రెండో రోజు తిరిగి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 70 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 310 పరుగుల వద్ద డిక్లేర్ చేసిది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 42.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగింసింది. కేఎస్ఆర్ఎం మైదానంలో కర్నూలు- ఈస్ట్ గోదావరి జట్లమధ్య సాగిన మరో మ్యాచ్‌లో మొదటి రోజున 78.5 ఓవర్లలో 162 పరుగులకు చేతులెత్తేసింది. ఈస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 64 పరుగులతో రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 67.4 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.





సాహితీవేత్త భాస్కరరాజు మృతి



ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహితీవేత్త విద్వాన్ భాస్కరరాజు (78) బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతిచెందారు. 35 సంవత్సరాలపాటు తెలుగు పండితునిగా వివిధ పాఠశాలలో పనిచేసి 2010లో పదవీ విరమణ చేశారు. పద్యకవిగా ప్రసిద్ధి పొందారు. తబల వాయించడం, ఆయన అభిరుచి. రామలింగ శతకం, కవితావిన్నపం వంటి కవితా సంకలనాలను వివరించారు. భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల సాహితీ అభిమానులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

'రౌడీషీట్ ఎత్తివేయాలి'

కాశినాయన అక్టోబరు (ఆంధ్రజ్యోతి)23: ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం మండల కన్వీనర్ పోలయ్యపై నమోదు చేసిన రౌడీషీట్ కేసును ఎత్తివేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. బుధవారం పోలయ్యపై పెట్టిన రౌడీషీటర్ ఎత్తివేయాలంటూ తహసీల్దారు కార్యాలయంవద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు, నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ రమణకు వినతి పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్, గురయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

వర్షంతో దెబ్బతిన్న ఉల్లి

ఆందోళనలో అన్నదాతలు

దువ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు ఏది వచ్చినా అన్నదాతలపైన ప్రభావం పడుతోంది. ఆరుగాలం కష్టించిన రైతన్నలను కాలవైపరీత్యాలు ఆర్థికంగా తినేస్తున్నాయి. వేలకు వేలు పెట్టుబడులకింద పంటల సాగుకు వెచ్చిస్తే ప్రకృతి వైపరీత్యాలు రైతన్నను కాటేస్తున్నాయి. ఈ దుస్థితి ప్రస్తుతం దువ్వూరు మండలంలో ఉల్లిపంట సాగు చేసిన రైతుల్లో నెలకొంది.

దువ్వూరు మండలంలో రైతులు ఎంతో ఆశతో ఉల్లిపంట సాగు చేశారు. నియోజకవర్గంలో దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాలు కేపీ ఉల్లిసాగుకు పెట్టింది పేరు. దీంతోపాటు పెద్దబళ్లారి రకం ఉల్లిని సైతం రైతులు విస్తారంగా సాగు చేశారు. అధికంగా దువ్వూరు మండలంలో ఈ పంట సాగవుతోంది. మండలంలో ప్రస్తుతం 2,711 ఎకరాల్లో ఉల్లిపంట పెట్టారు. ఇటీవల ఎడతెరపి లేకుండా పడ్డ



మదిరేపల్లెలో వర్షంతో దెబ్బతిన్న ఉల్లిపైరు

వర్షాలకు చిత్త తెగులు, వేరుకుళ్లు, ఇతరత్రా తెగుళ్ల ఆశించి పంట నాశనమైపోతోంది. ఏపుగా పెరగాల్సిన ఉల్లికాడలు ముడుచుకుపోతున్నాయి. దీని వలన ఉల్లిగడ్డ ఎదుగు, బొదుగు లేకుండా పోతోంది. రెండు నెలల వ్యవధి ఉన్న తోటల్లో ఉల్లిగడ్డల దిగుబడి 50 నుంచి 70 శాతం దాకా తగ్గిపోతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

● **పట్టని అధికారులు..:** ఈ పరిస్థితుల్లో ఉద్యాన శాఖ అధికారులు చురుగ్గా ఉండి పంటలను కొంతైనాకాపాడేందుకు రైతులకు సూచనలుఇవ్వాల్సి ఉండగా అవేమీ వీరికి పట్టడంలేదు. దీనికితోడు మరొకసారి ఈ తరహా వర్షం పడితే పంట నష్టాలను అంచనా వేస్తామని అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. ఈ తరహా వైఖరిని వీడి ఉల్లిరైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతులు పంట నష్టం అంచనాలు వేయాలని కోరుతున్నారు.

సగం పంట రైతుకు అందదు



ప్రస్తుత పరిస్థితుల్లో సగం పంట కూడా చేతికందదు. మరొకసారి ఈ తరహా వర్షం పడితే పంట పూర్తిగా పాడవుతుంది. నేను ఆరు ఎకరాల్లో కేపీ ఉల్లిపంట సాగు చేశాను. ఇప్పటికే రెండున్నర లక్షల దాకా పెట్టుబడులకు వెచ్చించాను. వ్యవసాయ శాఖ ఇటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఏమి చేయాలో పాలుపోవడంలేదు.

ఎం.నరేష్, ఉల్లిరైతు, మదిరేపల్లి

తహసీల్దారు కార్యాలయం తనిఖీ

ముద్దనూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు భద్రపరుచు గదిని పరిశీలించారు.అనంతరం కార్యాలయ సిబ్బంది మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరద కిశోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల ఉన్నతపాఠశాల తనిఖీ..: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం డిప్యూటీ డీఈవో క్రిష్ణప్ప తనిఖీ చేశారు.అందులో భాగంగా ఉపాధ్యాయులు పనితీరు పై విద్యార్థుల నుంచి ఆరాతీశారు. అలాగే మధ్యాహ్న భోజనంపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నాగేశ్వరనాయక్, సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

జమ్మలమడుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని 15, 16, 17, 18 వార్డులకు సంబంధించిన సచివాలయాలను బుధవారం సాయంత్రం జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన సచివాలయాలను తనిఖీ చేసి అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పక్కనే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పోలీసు లలిత, పోలీసు చంద్ర, టీడీపీ నాయకులు చదిపిరాళ్ల విశ్వనాథరెడ్డి, ఐఎల్ చిన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై రైతులకు అవహగాహన

కొండాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగుమంచిపల్లె సచివాలయంలో బుధవారం ఏవో రామాంజులరెడ్డి రైతుల కు సమాచార చట్టంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వశాఖలలో సమాచారాన్ని ఈ చట్టం ద్వారా నిర్ణీత గడువులోపు పొందవచ్చునన్నారు. రైతులు, ప్రజలు దీనిపై అవగాహన కలిగిఉండాలని ఏవో తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు,ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచినీరు అందించడమే లక్ష్యం

ఖాజీపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు మంచినీరు అందించడమే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎంపీడీవో దివిజనంపతి అన్నారు. బుధవారం కడప, కర్నూలు జాతీయ రహదారి పక్కన పైపులైను లీకేజీ ఉండడం గమనించి వెంటనే పనులు ప్రారంభించి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు వస్తుండడంతో ప్రజలు కాచిన నీరు మాత్రమే వినియోగించాలన్నారు. అలాగే పైపులైను ఎక్కడ లీకేజీ ఉన్నా తెలపాలన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

దువ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రామకృష్ణయ్య బుధవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తదితర అంశాలపై అవగాహన కల్పించి వీటిపై శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాకాల నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. ఇంటిపన్ను, కుళాయి పన్నులు వసూలు చేయాలని సూచించారు.

ఘనంగా మల్లేశ్వరకోనలో విగ్రహాల పునఃప్రతిష్ఠ



పార్వతిదేవి విగ్రహం

కొండాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల మల్లేశ్వరస్వామి కోనలో బుధవారం విగ్రహాల పునఃప్రతిష్ఠా కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. కోనలోని పార్వతిదేవి, నందీశ్వరుడు, నవగ్రహాలు, ధ్వజస్తంభం విగ్రహాలను పాతవాటి స్థానంలో కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మూడురోజుల పాటు శివునికి,నూతన విగ్రహాలకు హోమాలు ప్రత్యే పూజలు నిర్వహించి బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో పంటలు సాగు చేసుకోవాలి

ఖాజీపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడి వస్తుందని సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖాజీపేట-2 రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు ఉన్నాయని, అధికారులు సూచన మేరకు పత్తి విత్తనాలు తెచ్చుకుని సాగు చేయడంతోపాటు వారు చెప్పిన మందులను మాత్రమే పిచికారీ చేస్తే ఖర్చు తగ్గి అధిక లాభాలు వస్తాయన్నారు. అలాగే చెముళ్లపల్లె పంచాయతీలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీపై అవగాహన కల్పించారు. ఏవో నాగార్జున, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఖాజీపేట..పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

దువ్వూరు..: మండలంలోని రామాపురం గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉల్లి, అరటి, వేరుశనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఉల్లిలో అధిక తేమ శాతం ఉండడం వలన వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. తెగుళ్ల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు..: రైతులు పంటసాగుకు ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు.మండల పరిధి శెట్టివారిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య,సిబ్బంది రాధ , రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థినికి కాంస్య పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో కల్లూరు జడ్పీ హైస్కూలు విద్యార్థిని కాంస్యపతకం సాధించింది. ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో పోటీలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో కల్లూరు జడ్పీ హైస్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎస్.వీరభవిత జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. సాబర్ విభాగంలో కాంస్యపతకం సాధించింది. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ అల్లాబకాష్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ముద్దనూరు అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ముకుందారెడ్డి ప్రజలకు సూచించారు.టౌన్‌లోని ఎస్వీగిరి కాలనీలో డెంగ్యూ, విషజ్వరాలు ఉన్నందున బుధవారం ఎంపీడీవో ,డాక్టర్ కరిష్మ కాలనీలోని పరిసర ప్రాంతాలను పరిశీలించి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఎస్వీగిరి కాలనీ సమీపంలో పూడిపోయిన పాడుబడ్డ బావిలో చెత్త ,వ్యర్థాలు కుళ్ళి కంపు కొడుతుండటం, పందులు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. పందులను దూరప్రాంతాలకు తరలించే విధంగా పందుల యజమానులకు తెలియజేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు.పారిశుధ్య లోపం ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు.అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

టపాసుల అమ్మకందారులు నిబంధనలు పాటించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పోరుమామిళ్లలో దీపావళి టపాసులు అమ్మకాలు జరిపేవారు లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని నిబంధనలు పాటించాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో టపాసుల లైసెన్సుదారులు, ఫైర్ అధికారులు, పోలీసు అధికారులు, విద్యుత్‌శాఖ అధికారలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం శ్రీనివాసపురంలో హత్యకు గురైన వెంకటసుబ్బారెడ్డి కుటుంబాన్ని బుధవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, హత్యచేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

నర్సాపురంలో రెవెన్యూ గ్రామసభ

కాశినాయన అక్టోబరు(ఆంధ్రజ్యోతి)23: నర్సాపురం గ్రామసచివాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం పలువురు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రామక్రిష్ణారెడ్డి, మండల సర్వేయర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముంపువాసుల సమస్యలను

గాలికొదిలేసిన జగన్ ప్రభుత్వం

జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోటప్రాజెక్టు ముంపువాసుల సమస్యలను పట్టించుకోకుండా జగన్ ప్రభుత్వం గాలి కొదిలేసిందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చామలూరు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం సిమెంటురోడ్లకు శంఖుస్థాపన నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, మండల కూటమి ఇన్‌ఛార్జ్ శివనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోరుశెట్టిబాబు, టీడీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు లాభదాయకంగా మార్చాలి



మాట్లాడుతున్న డాక్టర్ జె.వి.రమణ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను రైతులకు లాభదాయకంగా మార్చాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ జె.వి.రమణ పేర్కొన్నారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో పశువైద్య విశ్వవిద్యాలయం, హెచ్‌వీఎస్‌బీటీ ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమను కొనసాగిస్తున్నారని తెలిపారు. రైతుల పాడిపశువులకు మేలు చేకూర్చేలా శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం పశువైద్యంలో వినూత్న పరిశోధనలు చేసిన పలువురు శాస్త్రవేత్తలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్‌బీటీ అధ్యక్షుడు డాక్టర్ ఎజె.ధామి, కార్యదర్శి డాక్టర్ కేకే హాదియా, పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ రాధాకిశోర్, పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, పశువైద్యులు డాక్టర్ ఇందిర, మానస, అనూష, మంజుల, నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా మండల పూజ

గోపవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం చెన్నవరం గ్రామంలో ని పట్టాభి రామస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా మండల పూజ కార్యక్రమం జరిగింది. వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకం పూజ కార్యక్రమం నిర్వహించి స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మానసిక వైకల్యం అధిగమించాలి

దువ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యం అధిగమించేందుకు బాధిత పిల్లలను ప్రోత్సహించి వారికి చిత్సలు నిర్వహించాలని ఫిజియోథెరపిస్టు మస్తాన్‌వలి తెలిపారు. దువ్వూరులోని పీడబ్ల్యూడీ బంగ్లాలో బుధవారం సంబంధిత పిల్లలకు చికిత్సలు నిర్వహించారు. వీరితో ఆసనాలు వేయించారు.



గతుకులకు అతుకులు ఎప్పుడో..?

● మున్సిపాలిటీ పరిధిలో రోడ్లకు గుంతలు ● గుంతలతో రాకపోకలకు అంతరాయం ● అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని హనుమాన్‌నగర్, జిన్నారోడ్డు, వన్‌టౌన్‌సర్కిల్, మోడంపల్లె, సూపర్‌బజార్‌రోడ్లలో రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. రోడ్లకు గుంతలు పడడంతో చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్‌లో రోడ్డుకు మధ్యలో పైపులైను కోసం గుంతలు తవ్వి పైపులైను పనులు అయిన తర్వాత మట్టితో గుంతలు పూడ్చారని, వర్షాల కారణంగా మట్టి తగ్గడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్లు నిర్మించడమా... లేక గుంతలకు ప్యాచింగ్ వేయడమో చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





మోడంపల్లెలో దెబ్బతిన్న రోడ్డు, హనుమాన్‌నగర్‌లో గుంతలు పడిన రోడ్డు



వన్‌టౌన్ సర్కిల్‌లో దెబ్బతిన్న రోడ్డు

● రోడ్డు దెబ్బతినడంతో అవస్థలు



హనుమాన్ నగర్‌లో కొన్ని సంవత్సరాలుగా పైపులైనుకోసం రోడ్డు మధ్యలో గుంతలు తవ్వారు. అనంతరం పైపులైను వేసిన తర్వాత రోడ్డును వేయడం మరిచారు. రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారు.

● లక్ష్మీనారాయణ, హనుమాన్‌నగర్, ప్రొద్దుటూరు